సాక్షి
కర్నూలు
బుధవారం, 5, ఏప్రిల్, 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయ ప్రాంగణంలోని శన గల బసవన్న, నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకుడు బయలు వీరభద్ర స్వామికి మంగళవారం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



ఇదీ విషయం..

వేసవిలో మార్కెట్‌కు వస్తున్న మామిడిని కొందరు వ్యాపారులు నిషేధిత కాల్షియం కార్బైడ్‌ను వినియోగించి మాగిస్తున్నారు. మామిడి ప్రియులు పండు కొనే ముందు జాగ్రత్తగా పరిశీలించాలి. 8లో..



సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి మంగళవారం ఎగువ నుంచి 330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాం లో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, కేసీ కాల్వకు 505 క్యూసెక్కులు విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:47
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:50
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:50
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:44
బనగానపల్లె	సా॥ 6:39	ఉ॥ 4:44

హదీస్ వెలుగు :

బహు దైవారాధనను అల్లాహ్ తీవ్రంగా పరిగణిస్తారు. ఇలాంటి మహా పాపము నుంచి రక్షించమని అల్లాహ్‌ను వేడుకోండి.

– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

సినీ నటుల సందడి



హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్యా రవి

కర్నూలు కల్చరల్: 'మీటర్' సినిమా హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్యా రవి మంగళవారం కర్నూలులో సందడి చేశారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా వారు ఆనంద్ థియేటర్‌కు వచ్చారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 'మీటర్' సినిమా ఈనెల 7వ తేదీన విడుదలవుతుందన్నారు. అన్ని ఎలిమెంట్స్ ఉన్న ఈ చిత్రాన్ని ఆదరించాలని ప్రేక్షకులను కోరారు.

ప్రతి మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రతి మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ హరి కిరణ్ తెలిపారు. మంగళవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పంటలకు సోకే అన్ని రకాల సమస్యలకు ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ల ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సెంటర్ల ఇన్‌చార్జీలకు మెటీరియల్ సిద్ధం చేశామని, శిక్షణ ఇచ్చేందుకు తగిన షెడ్యూలు రూపొందించుకోవాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. భూసార పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. వేసవిలో సాగు చేసిన పంటలను కూడా ఈ–క్రాప్‌లో నమోదు చేసేందుకు యాప్ విడుదల చేశామని స్పష్టం చేశారు. కర్నూలు నుంచి వీసీలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్‌ఖాద్రీ, గిరీష్, అగ్రానమీ ఏడీ బాలవర్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగనాథుడి రథోత్సవం

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. కోరిన కోర్కెలు తీర్చేస్వామిగా విరాజిల్లే తర్తూరు రంగనాథుడికి దాదాపు 132 ఏళ్ల క్రితం దాతలు చెక్కతో 25 అడుగుల ఎత్తైన రథాన్ని తయారు చేయించారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఇదే రథంపై స్వామిని ఊరేగిస్తున్నారు. జిల్లాలో తర్తూరు జాతరకు ఎంతో విశిష్టత ఉంది.

తొమ్మిది మంది డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం చూచిరాతలకు పాల్పడిన తొమ్మిది మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఉదయం జరిగిన పరీక్షలకు 2,297 మంది విద్యార్థులకుగాను 2,125 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 3,519 మంది విద్యార్థులకుగాను 3,157 మంది విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

కృష్ణమ్మకు బోనాల సమర్పణ



బోనాలతో వెళ్తున్న మత్స్యకార మహిళలు

శ్రీశైలం: ఈనెల 11వ తేదీన అమ్మవారి కుంభోత్సవం సందర్భంగా స్థానిక మత్స్యకార మహిళలు మంగళవారం కృష్ణమ్మకు బోనాలు సమర్పించారు. పాతాళగంగ మెట్ల మార్గంలో బోనాలతో వెళ్లి కృష్ణవేణి నదికి పూజలు చేసి పసుపు, కుంకుమ, పూలు, గాజులు, చీర జాకెట్లతో కూడిన సారె సమర్పించారు. ఏటా అమ్మవారి కుంభోత్సవం రోజు కాని, ఆ తర్వాత వచ్చే మంగళ, శుక్రవారాల్లో కృష్ణమ్మకు సారెను సమర్పించడం సంప్రదాయంగా వస్తుంది.

సకాలంలో శస్త్ర చికిత్స



డోన్‌కు చెందిన మహబూబ్ బాషా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో సొంత పనుల నిమిత్తం బనగానపల్లె మండలం పసుపల గ్రామానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో బైక్ ఢీకొని కాలు విరిగిపోయింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ రఫీ, పైలెట్ కిరణ్ త్వరితగతిన అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని డోన్ ఆసుపత్రిలో చేర్పించారు. సకాలంలో ఆసుపత్రికి రావడంతో వైద్యులు కాలికి శస్త్ర చికిత్స చేశారు.

తల్లి, బిడ్డ క్షేమం



గతేడాది జూలై నెలలో సంజామల మండలం ఆర్. లింగందిన్నె గ్రామానికి చెందిన సూర్యుడు భార్య గంగాజ్యోతికి నెలలు నిండి ప్రసవ నొప్పులు అధికం కావడంతో సంజామల 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే గ్రామానికి వెళ్లి తీసుకొస్తుండగా కోవెలకుంట్ల మండలం పాట్టిపాడు మెట్ట సమీపంలో అంబులెన్స్‌లోనే పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ సంటిన్న, పైలెట్ జయన్న ప్రాథమిక వైద్య సేవలందించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఇంటికి చేరుకున్నారు.

ఊపిరి పోస్తున్నాయ్!



- ఆపదలో ఆదుకుంటున్న 108
- అంబులెన్స్‌ల్లో ఆధునిక పరికరాలు
- గర్భిణులకు వరం
- నవజాత శిశువుల కోసం నియోనేటర్ అంబులెన్స్‌లు
- ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని సకాలంలో ఆసుపత్రికి
- జిల్లాలో సాయం పొందినవారు లక్షల్లోనే..

కోవెలకుంట్ల: రోడ్డు ప్రమాదాలు, అత్యవసర వైద్య సహాయం, పురిటి నొప్పులు ఇలా ఆపద ఏదైనా ఠక్కున గుర్తుచ్చేది 108 అంబులెన్స్. ఎందుకంటే ఇవి సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడుతాయి. ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి ఊపిరి సైతం పోస్తాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి మండలానికి అంబులెన్స్‌లు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ మూడున్నరేళ్ల కాలంలో లక్షలాది మంది 108 సేవల ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 108 అంబులెన్స్‌లను ప్రవేశపెట్టారు. తర్వాత కాలంలో వచ్చిన టీడీపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అంబులెన్స్‌ల రూపురేఖలు మారిపోయాయి. ఆపదలో ఉన్న వారికి ఊపిరి పోస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 35 వాహనాలు మాత్రమే పనిచేస్తుండేవి. వాటిలో కూడా కొన్ని ఎప్పుడు మరమ్మతులకు గురి అవుతూ పూర్తి స్థాయిలో సేవలందించేవి కావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ కేటాయించడంతో 57 అంబులెన్స్‌ల ద్వారా రోడ్డు ప్రమాద క్షతగాత్రులు, అనారోగ్య బాధితులు, గర్భిణులు, పురిటిబిడ్డలు, కిడ్నీ, శ్వాస సంబంధ, తదితర రోగులను సకాలంలో ఆసుపత్రుల్లో చేర్చి ప్రాణాలు కాపాడుతూ అద్భుతమైన సేవలందిస్తున్నాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 108 సాయం పొందిన వారి వివరాలు

బాధితులు	2020	2021	2022	2023
కోవిడ్ బాధితులు	8,519	4,177	164	1
గర్భిణులు	5,831	7,222	24,085	626
రోడ్డు ప్రమాదం	2,196	3,054	7,468	312
శ్వాస సంబంధం	2,019	4,953	7,902	613
కిడ్నీ బాధితులు	356	11,529	10,198	32
పురుగుమందు బాధితులు	1,031	4,655	3,638	179
ఇతర ఆరోగ్య సమస్యలు	7,641	49,812	37,499	4,356

సాయం పొందిన వారు లక్షల్లోనే

ఉమ్మడి జిల్లాలో 57 అంబులెన్స్‌లు ఉండగా జిల్లాల పునర్విభజనలో నంద్యాల జిల్లాకు 30 అంబులెన్స్‌లు కేటాయించారు. ఆయా అంబులెన్స్‌ల్లో 200 మంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, పైలెట్లు నిత్యం ప్రజలకు సేవలందిస్తున్నారు. ఆయా మండలాలకు కేటాయించిన అంబులెన్స్‌ల్లోని ప్రతి వాహనంలో ఆధునిక యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కరోనా సమయంలో సైతం సిబ్బంది ప్రాణాలకు తెగించి 108 వాహనాల ద్వారా బాధితులను ఆసుపత్రులకు తరలించారు. గడిచిన మూడున్నరేళ్లకాలంలో దాదాపు 2.10 లక్షల మంది అంబులెన్స్‌ల ద్వారా సాయం పొందారు.

ఆధునిక వైద్య పరికరాలు

అంబులెన్స్‌లో ఆక్సిజన్ అందించే ట్రాన్స్‌పోర్టు వెంటిలేటర్ ఏర్పాటు చేశారు. రోగులు శ్వాస తీసుకోవడం ఇబ్బంది పడుతున్నా, ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నా వారిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడేందుకు ఈ పరికరం ఉపయోగ పడుతుంది. ఈసీజీ స్థాయిని నిరంతరం చూడడంతో పాటు బీపీని పర్యవేక్షించేందుకు ఉష్ణోగ్రత పరిశీలనకు మల్టీ పారామీటర్ ఉంచారు. నాడి కొట్టుకునే విధానాన్ని ఆక్సిజన్ శాతాన్ని తెలుసుకునేందుకు పల్స్ ఆక్సీమీటర్ ఉంది.

రెండు నియోనేటర్ అంబులెన్స్‌లు

నవజాత శిశువులు(పురిటిబిడ్డలు)లకు ప్రాథమిక చికిత్స చేసేందుకు తద్వారా వారి ప్రాణాలు కాపాడేందుకు అత్యాధునిక నియోనేటర్ పరికరాలతో కూడిన రెండు అంబులెన్స్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. నంద్యాల, ఆదోని పట్టణాలకు వీటిని కేటాయించారు. నియోనేటర్ అంబులెన్స్‌లో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 40 రోజుల వయస్సులోపు నవజాత శిశువులకు శ్వాస సంబంధ, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే వారికి సకాలంలో వైద్యచికిత్సలు అందించేందుకు వీటిని వినియోగిస్తున్నారు. నియోనేటర్ అంబులెన్స్‌లలో ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

సేవలను వినియోగించుకోవాలి



ఉమ్మడి జిల్లాలో 57 అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. గతానికి భిన్నంగా 108 అంబులెన్స్‌లపై పర్యవేక్షణ ఉంది. ఆపదలో ఉన్న వారు ఫోన్ చేసిన 20 నిమిషాల్లోనే అంబులెన్స్ అక్కడికి చేరుతుంది. పట్టణ ప్రాంతాల్లో పది నిమిషాల్లో సంఘటనా స్థలానికి వెళుతుంది. ఈఎంటీ, పైలెట్‌లు సకాలంలో బాధితులను ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడుతున్నారు.

– చంద్రమౌళి, 108, 104, 102 వాహనాల జోనల్ మేనేజర్, కర్నూలు

పట్టుపరిశ్రమ శాఖలో పదోన్నతులు

- జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారిగా విజయకుమార్



కర్నూలు(అగ్రికల్చర్): పట్టుపరిశ్రమ శాఖలో పలువురికి అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారిలో ఐ.విజయకుమార్ జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. బండిఆత్మకూరు మండలం సింగవరం గ్రామానికి చెందిన ఆయన వెల్దుర్తిలో పట్టుపరిశ్రమ అధికారి(సెరికల్చర్ ఆఫీసర్)గా పని చేస్తూ ఏడీగా పదోన్నతి పొందారు. ఈయనను ఖాళీగా ఉన్న జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారిగా నియమించారు. ఇంతవరకు నంద్యాల పట్టుపరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరమేశ్వరి పూర్తి అదనపు బాధ్యతలతో ఏడీగా విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలు జిల్లాకు రెగ్యులర్ అధికారి నియమితులు కావడంతో పరమేశ్వరి పూర్తిగా నంద్యాల జిల్లాపైనే దృష్టి సారిస్తారు. కర్నూలు జిల్లాలో పట్టుపరిశ్రమ, మల్బరీ సాగును మరింత ప్రోత్సహిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కాగా మరో 5గురు సెరికల్చర్ ఆఫీసర్లకు ఏడీలుగా పదోన్నతి లభించింది. కర్నూలు సెరికల్చర్ అధికారి నారాయణరెడ్డి పదోన్నతిపై మార్కాపురం, ఆత్మకూరులో పనిచేస్తున్న దేవోత్తమరెడ్డిని మదనపల్లి, డి.వెంకటస్వామి నాయక్‌ను సత్యసాయి జిల్లా గోరంట్ల, నంద్యాలలో ఉన్న ఉషావర్ధినిని పదోన్నతిపై కళ్యాణదుర్గం అసిస్టెంట్ డైరెక్టర్లుగా నియమించారు. ఆత్మకూరులో సెరికల్చర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కే.నగేష్‌ను పదోన్నతిపై అక్కడే ఏడీగా నియమించారు.

శ్రీశైలం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్‌గా శ్రీరామప్రసాద్

కర్నూలు(సెంట్రల్): శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా శ్రీరామ ప్రసాద్ నియమితులయ్యారు. విశాఖపట్నంలో టూరిజం శాఖ రీజినల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన అనారోగ్యంతో లాంగ్ లీవ్‌లో ఉన్నారు. ఇటీవల ఆరోగ్యం కుదుటపడటంతో శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా నియమించారు. ఆ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

విద్యుత్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- సిబ్బంది స్పందించకపోతే 1912 నంబర్‌కు ఫిర్యాదు చేయండి
- డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమంలో ఎం. ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తప్పవని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి హెచ్చరించారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లో డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను తెలుసుకునేందుకే తాను ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఫిర్యాదులను నమోదు చేసుకుని, వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యుత్ పరంగా ఏ సమస్య వచ్చినా లైన్‌మెన్ మొదలుకొని ఏఈ, ఏఈడీ, ఈఈల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వినియోగదారుల సమస్యలపై తక్షణమే స్పందించాలని కింది స్థాయి అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేశామన్నారు. పట్టించుకోకపోతే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.



డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఈ ఎం. ఉమాపతి

ప్రమాదాలు జరిగితే మీదే బాధ్యత

కిందికి వేలాడుతూ ఉండే విద్యుత్ తీగల వల్ల ఎలాంటి ప్రమాదం జరిగినా ఏఈలు, ఏడీఈలు బాధ్యత వహించాల్సి ఉంటుందని కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. మంగళవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలను తొలగించి ఎత్తు పెంచాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, అయితే వాటి పనుల అంచనాలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా పెట్టుకోవాలని సూచించారు.

రేపు బీసీ సంఘాల సమావేశం

కర్నూలు(అర్బన్): ఈనెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం నిర్వహణపై అవసరమైన సలహాలు, సూచనల కోసం ఈనెల 6వ తేదీన బీసీ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఎ. నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే తమ వద్ద ఉన్న సమాచారం మేరకు బీసీ కుల సంఘ నాయకులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చామని, ఇంకా సమాచారం అందని వారు ఎవరైనా ఉంటే ఇదే ఆహ్వానంగా భావించి సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఆదోనిలో మూడు కరోనా కేసులు

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గంలో మూడు కరోనా కేసులు నమోదయ్యాయి. ఒక కేసు గ్రామీణ ప్రాంతంలో, రెండు కేసులు పట్టణంలో నమోదయ్యాయని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి మంగళవారం తెలిపారు. మండిగిరి పంచాయతీలో ఒక కేసు, షరాఫ్‌బజార్‌లోని ఒకే ఇంట్లో రెండు కేసులు నమోదయ్యాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతిఒక్కరూ మాస్కులు ధరించడంతో పాటు సామాజిక దూరం పాటించాలన్నారు. దగ్గు, జ్వరం ఉంటే వెంటనే ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక ఏప్రిల్ నెల పంపిణీ ఊపందుకుంది. సోమవారమే పింఛన్ల పంపిణీ మొదలైనప్పటికీ బ్యాంకుల నుంచి నగదు డ్రా చేయడం, వలంటీర్లకు అప్పగించడంలో జాప్యం వల్ల కొన్ని గ్రామాలకే పరిమితమైంది. మంగళవారం ఉదయం నుంచి అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. కర్నూలు జిల్లాలో 2,38,448 పింఛన్లకు నిధులు విడుదలయ్యాయి.అయితే 1,19,287 పింఛన్లు పంపిణీ చేయడం విశేషం. నంద్యాల జిల్లాలో 2,16,136 పింఛన్లకు నగదు విడుదల కాగా.. 1,21,432 పింఛన్లు పంపిణీ చేశారు. వార్డు, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం విశేషం. డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య, అదనపు పీడీ షరీఫ్‌లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.



నందవరం మండలం నాగలదిన్నెలో ముత్యాలమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నరసింహ

నేడు అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): తమిళనాడులోని అరుణాచల క్షేత్ర దర్శనం కోసం బుధవారం సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు కర్నూలు–1 డిపో అసిస్టెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న సాయంత్రం 5 గంటలకు బస్సు కర్నూలు నుంచి బయలుదేరి మరుసటి రోజు (6వ తేదీ) ఉదయం 6 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని.. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శనానంతరం అదే రోజు సాయంత్రం 4 గంటలకు బస్సు బయలుదేరి మార్గమధ్యంలో వేలూరు స్వర్ణ దేవాలయం దర్శనం అనంతరం 7వ తేదీ ఉదయం 6 గంటలకు కర్నూలు చేరుకుంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సులో రానుపోను చార్జీ రూ.2 వేలు ఉంటుందని, ముందస్తు టిక్కెట్లు పొందేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. వివరాలకు 7702774358 నెంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్ద పీట

- 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత సీఎంకే దక్కింది
- జూలై నాటికి వాటర్ గ్రిడ్ నుంచి బేతంచెర్లకు శుద్ధనీరు
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



వైఎస్సార్ ఆసరా చెక్కును పొదుపు మహిళలకు అందజేస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, ఎంపీ పోచా



సంబరాలకు భారీగా హాజరైన పొదుపు మహిళలు

బేతంచెర్ల: రాష్ట్ర చరిత్రలో ఎవరూ చేయని విధంగా మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. స్థానిక షిరిడీ సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి బుగ్గన, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, మెప్మా పీడీ శివలీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా రూ. 25 వేల కోట్లు కేటాయించి పొదుపు గ్రూపు మహిళల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. బేతంచెర్ల మండలంలో 1,352 పొదుపు గ్రూపుల్లోని 13,186 మంది సభ్యులకు మూడో విడతలో రూ.8,30,75,914 జమ చేశామన్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ. 24,92,27,742 మహిళ ఖాతాల్లో జమ చేశామన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా ప్రస్తుతం రూ. 2,750 ఇస్తుండగా వచ్చే ఏడాది రూ. 3 వేలు ఇస్తామని, అసెంబ్లీ సాక్షిగా సీఎం ప్రకటించారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

మోసకారి చంద్రబాబు మాటలు నమ్మొద్దు

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి మోసపు మాటలు నమ్మవద్దని మహిళలకు సూచించారు. గతంలో పొదుపు గ్రూపు మహిళలకు వడ్డీ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించి బలవంతంగా కట్టించినది వాస్తవం కాదా.. అని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలు పెరిగాయని టీడీపీ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని, ఢిల్లీ, బెంగళూరు, మహారాష్ట్ర, తెలంగాణలో కూడా పెరగలేదా.. అని ప్రశ్నించారు. అవాస్తవాలను మాట్లాడుతున్న టీడీపీ నాయకులకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రూ.330 కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయిస్తున్నామని, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నియోజకవర్గంలో ప్రతి ఇంటికి శుద్ధనీటిని సరఫరా చేస్తామన్నారు. జూలై నాటికి మొదటి విడత కింద బేతంచెర్ల మండలానికి, రెండో విడత డోన్, మూడో విడత ప్యాపిలి మండలాలకు అందిస్తామన్నారు. విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ బేతంచెర్ల మండలంలో బీసీ రెసిడెన్షియల్ స్కూలు ఏర్పాటుతో పాటు ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు కూడా మంజూరు చేయించామన్నారు. యువతులకు నర్సింగ్ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువకులకు శిక్షణ కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

అక్కచెల్లెమ్మలు ఆశీర్వదిస్తే 175 సీట్లు తథ్యం.. ఎంపీ పోచా

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అక్కచెల్లెమ్మలు ఆశీర్వదిస్తే వచ్చే ఎన్నికల్లో 175 సీట్లను వైఎస్సార్‌సీపీ గెలుపొందడం తథ్యమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో 80 లక్షల మహిళా సభ్యులకు జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రతి సంక్షేమ పథకంలో వారిని భాగస్వాములను చేశారన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఇంటికి మేలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటారని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును పొదుపు గ్రూపు మహిళలకు చేశారు. ఈ సందర్భంగా సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, జెడ్పీటీసీ శివలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, వైకేపీ ఏపీఎం లింగమయ్య, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తుంగభద్రలో వ్యక్తి గల్లంతు...

కర్నూలు: సాయిబాబా సంజీవయ్య నగర్‌కు చెందిన నేసె నాగరాజు (40) తుంగభద్ర నదిలో మునిగి గల్లంతయ్యాడు. కొత్తపేట సమీపంలోని నది అవతలి ఒడ్డున తన ఎద్దులను కట్టేసి మంగళవారం ఇవతలి ఒడ్డుకు ఈదుకుంటూ వస్తూ మునిగిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు నది వద్దకు చేరుకుని గాలించినా ఆచూకీ కనిపించలేదు.

సమ్మర్ స్టోరేజ్‌లో పడి యువకుడు మృతి...

కర్నూలు మండలం మునగాలపాడు సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో వెంకటకృష్ణారెడ్డి (31) పడి మృతిచెందాడు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కాలనీలో నివాసముంటాడు. స్నేహితుడు రాకేష్‌తో కలసి ద్విచక్ర వాహనంపై సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్దకు వెళ్లి విందు చేసుకుని తిరిగి వచ్చేటప్పుడు గట్టుపైన (సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్) ద్విచక్ర వాహనం రివర్స్ తిప్పుతూ అదుపు తప్పి నీటిలోకి పడి మృతిచెందాడు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి హల్‌చల్

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో వ్యక్తి హల్‌చల్ చేశాడు. గూడూరు మండలం జులకల్ గ్రామానికి చెందిన పింజరి మౌలాలి మంగళవారం జడ్చర్ల వెళ్లేందుకు కర్నూలు నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలును ఎక్కాడు. అయితే రైలులో సీటు దొరక్కపోవడంతో చైను లాగాడు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఆరా తీస్తుండగా వారితో వాగ్వివాదానికి దిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. దీంతో అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా వెళ్లి రైల్వే పట్టాలపై పడుకున్నాడు. వెంటనే జీఆర్పీ పోలీసులు పట్టుకుని అతనిపై కేసు నమోదు చేశారు.

అప్పులబాధ తాళలేక..



మృతి చెందిన ఆకుల కృష్ణుడు

నందికొట్కూరు: అప్పుల బాధ తాళలేక నాగటూరు గ్రామానికి ఆకుల కృష్ణుడు(55) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయంలో సరైన దిగుబడి రాక నష్టపోవడం, ఇద్దరు కుమార్తెల వివాహానికి చేసిన అప్పులు పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. నాగటూరు–కొణిదేల మార్గ మధ్యలో మంగళవారం వేప చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య పార్వతమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

తౌబా.. తౌబా !

- అల్లాకు క్షమాపణలు కోరుదాం
- ప్రారంభమైన మగ్‌ఫిరత్ రోజాలు
- ముగిసిన మొదటి దశకం

కర్నూలు(రాజ్‌విహార్): చాలా మంది తెలుసో తెలియకో తప్పులు చేస్తుంటారు. దీనినే ఇస్లాంలో 'సబీరా.. కబీరా గునాహ్' అంటారు. ఈ పాపాలను ఎప్పటికప్పుడు కడిగేసుకోవడం మంచిది. ముఖ్యంగా సాధారణ రోజుల్లో క్షమాపణలు కోరడం కంటే రంజాన్ మాసంలో వేడుకోవడంతో ప్రతిఫలం అధికంగా ఉంటుందని మౌల్వీలు అంటారు. అందులోనూ రంజాన్ రెండో దశకంలో అయితే మరీ మంచిదని సూచిస్తారు. తమ పాపాల నుంచి ప్రతి ముస్లిం తౌబా (క్షమాపణలు) కోరే రెండో అష్ర ప్రారంభమైంది.

నడవడిక నేర్పే మాసం

మన పద్ధతులు, వ్యవహారాలను చక్కదిద్దుకునేందుకు రంజాన్ చక్కటి అవకాశం కలిగిస్తోంది. ముస్లింలకు ఇదో శిక్షణ మాసం. మంచి నడవడికకు మార్గం. ఈ నెలలో ప్రతి ముస్లిం అల్లాహ్ నుంచి వరాలు అందుకునే భాగ్యం కలుగుతుంది. కఠోర దీక్ష, చిత్తశుద్ధితో అల్లాహ్‌ను ప్రార్థించిన వారికి చక్కటి జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తుంది. అందుకే ఈ పవిత్ర మాసంలో ప్రతి ఒక్కరూ చేసిన తప్పులు సరిదిద్దుకుంటూ తమ శక్తి కొలది దాన ధర్మాలు చేస్తారు. అల్లా సన్నిధిలో గడుపుతారు. ఇదే మాసంలో అవతరించిన దివ్య ఖురాన్ ముస్లిం సోదరుల జీవితాలను సన్మార్గంలో నడిపించడమే కాకుండా వారు అవలంబించాల్సిన జీవన శైలిని సూచిస్తుంది. ఈ మాసపు ఉపవాసాలను మూడు దశల్లో పాటిస్తారు.

మూడు భాగాల 'రంజాన్'..

రంజాన్ మాసం 30 రోజుల పాటు ఉంటుంది. కొన్నిసార్లు 29 రోజుల నెల కూడా వస్తుంది. ఈ మాసాన్ని మూడు భాగాలగా పరిగణిస్తారు. మొదటి రోజా నుంచి పదో ఉపవాసం వరకు మొదటి భాగం. దీనిని 'రహమత్‌కా అష్ర'గా భావిస్తారు. అంటే ఈ మొదటి పది రోజుల్లో సృష్టికర్త అల్లాహ్ యొక్క కరుణ, దయ ఎక్కువగా ఉంటుందని చెబుతారు. ఈ దశకం ఆదివారంతో ముగిసింది. 11వ రోజా నుంచి 20వ ఉపవాసం వరకు రెండో భాగం. దీనిని 'మగ్ ఫిరత్ కా అష్ర' అని అంటారు. అంటే ఈ 10రోజుల్లో చేసిన పాపాల నుంచి క్షమాపణలు కోరేందుకు అవకాశం ఉంటుంది. ఈ అష్ర సోమవారం నుంచి ప్రారంభమైంది. మిగిలిన చివరి, మూడో భాగం (21 నుంచి 30 లేదా 29 రోజుల వరకు) జహన్నమ్ సే ఫనా మాంగ్ నేకా అష్ర'గా చెబుతారు. చేసిన పాపాలు చెరిగిపోని పక్షంలో అంటే పరలోకంలో నరకం నుంచి మినహాయింపు కోరి.. స్వర్గాన్ని ప్రసాదించమని కోరేవిగా విశ్వసిస్తారు. ఇలా మూడు భాగాలుగా ఉన్నట్లు మత పెద్దలు చెబుతారు.



దువా చేస్తున్న ముస్లింలు

ముస్లింలకు శిక్షణ మాసం



పవిత్ర రంజాన్ మాసం మనకు స్వీయ క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, సేవాభావం, త్యాగనిరతి, భక్తిభావం, ప్రేమ ఇలా పలు విషయాలు నేర్పుతుంది. తల్లిదండ్రుల ప్రేమ లేకుంటే ఇంట్లో నెట్టుకురాలేము. అలాగే అల్లాహ్ ప్రేమ లేకపోతే జన్నత్ (స్వర్గం) పొందలేము.

– ఖాజీ అల్తాఫ్ హుసేన్, ప్రభుత్వ ప్రధాన ఖాజీ, ఆదోని.

తరచూ అస్తఘార్ చదవాలి



మొదటి అష్ర రహమత్ కా. అంటే అల్లాహ్ దయ, కరుణ కోసం కేటాయించబడింది. రెండో అష్ర మగ్ ఫిరత్‌కా. అంటే చేసిన పాపాల నుంచి క్షమాపణలు కోరేది. దీని కోసం తరచు అస్తగ్‌ఫిరుల్లా చదవాలి. చివరి పది రోజాలు నరకాగ్ని నుంచి రక్షణ కోరేది.

–ఖాజీ ముహమ్మద్ సందాని, ప్రభుత్వ ఖాజీ, నంద్యాల జిల్లా

అల్లాహ్ కరుణ చూపే మాసం



రంజాన్ నెలాంతా అల్లాహ్ కరుణ చూపే మార్గం. ఆయన మార్గంలో నడిచేవారిపై అల్లా దయ, కరుణ, ఆశీర్వాదాలు, క్షమాపణలు చూపుతారు. ముఖ్యంగా మధ్య భాగం అంటే 11 నుంచి 20వ రోజుల వరకు పశ్చాత్తాపంతో అస్తగ్‌ఫార్ చదివి తమ పాపాలను క్షమించమని అల్లాహ్‌ను కోరాలి.

– మొహమ్మద్ తౌసీఫ్ సయీది, ప్రభుత్వ ఖాజీ, కర్నూలు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



కస్తూర్బా విద్యార్థినుల సందేహాలను నివృతి చేస్తున్న పీఓ డాక్టర్ వేణుగోపాల్

సి.బెళగల్: పదవ తరతగతి పబ్లిక్ పరీక్షలలో కస్తూర్బా పాఠశాలల విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన స్థానిక కస్తూర్బా విద్యాలయంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. పదవ తరగతి పరీక్షలలో అందరు మంచి మార్కులు సాధించేందుకు ప్రభుత్వం ఉచితంగా విజయదీపికలను అందజేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా విద్యార్థినులు పాఠ్యాంశాలలోని పలు సందేహాలను పీఓను అడగటంతో ఆయన వాటిని నివృతి చేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు–నేడు రెండవ విడత పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని ఎస్‌ఓ జ్యోతిని ఆదేశించారు. పాఠశాల టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

బయటపడిన పురాతన ఇనుప బీరువా

- ఇత్తడి నాణేం, పాత డాక్యుమెంట్లు లభ్యం



పురాతన బీరువా,(ఇన్‌సెట్) బీరువాలో దొరికిన ఇత్తడి నాణేం

ఆలూరు: దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో పాత మిద్దెను పడగొట్టి మట్టి తరలిస్తుండగా పురాతన ఇనుప బీరువా బయట పడింది. అందులో గుప్తనిధులు లభించినట్లు ప్రచారం జరగడంతో పోలీసులు పరిశీలించారు. వివరాల్లోకి వెళితే.. చాకలి నరసింహప్ప అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన నరసింహారెడ్డి వద్ద పాతమట్టి మిద్దెను కొనుగోలు చేశాడు. దీనిని కొత్తగా నిర్మించుకునేందుకు పడగొట్టాడు. మంగళవారం కూలీలతో మిద్దె మట్టి తరలిస్తుండగా పాత ఇనుప బీరువా కనిపించింది. దానికి తాళం వేసి ఉంది. ఈ విషయం ఆ నోట ఈ నోట పడి పోలీసులు, రెవెన్యూ అధికారులకు చేరింది. గ్రామానికి చేరుకుని కట్టర్ సాయంతో బీరువాను పగలగొట్టి చూడగా అందులో 1942 నాటి ఇత్తడి అణ నాణెం, ఆస్తులకు సంబంధించిన పాత డాక్యుమెంట్ పత్రాలు లభించాయని ఎస్‌ఐ భూ పాలుడు వెల్లడించారు. ఇంటి పాత యజమానిని అడగగా ఆ బీరువా తనది కాదని చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఇదీ విషయం!

- మార్కెట్‌లో ప్రమాదకర కెమికల్స్‌తో మాగించిన మామిడి
- ప్రభుత్వం నిషేధించినా అడ్డగోలుగా వినియోగం
- ఆరోగ్యకర పద్ధతుల్లో మాగించిన పండ్లు సురక్షితం
- రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): పళ్లలో మామిడి రారాజు. సంపన్నులైనా, సామాన్యులైనా మామిడి రుచి ఆస్వాదించాల్సిందే. ఇలా అందరికీ పసందైన మామిడి వేసవికాలం ప్రారంభం కావడంతో మార్కెట్‌లోకి వస్తోంది. అయితే, పలు చోట్ల పండ్లను పరిశీలిస్తే పైన పటారం లోన లొటారం అన్న చందంగా ఉన్నాయి. గాలికి రాలిన కాయలను వ్యాపారులు ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి మాగించి తెస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఈ కాల్షియం కార్బైన్ వినియోగాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2012లోనే నిషేధించింది. ఆరోగ్యకర పద్ధతుల్లో సహజత్వానికి దగ్గరగా మాగించాలని సూచించింది. దీని వల్ల పండుకు డిమాండ్‌తో మంచి ధర లభిస్తోంది. ఈ దిశగా ఉద్యాన శాఖ అధికారులు మామిడి రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు.

పండ్లు ఎలా మాగుతాయి...

సాధారణంగా పండ్లు పక్వానికి వచ్చినప్పుడు ప్రకృతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తి అయ్యే ఇథిలిన్‌తో మాగుతాయి. ఇథిలిన్ పండు పక్వానికి వచ్చినప్పుడు దాని నిర్మాణ, రంగు, రుచి వంటి మార్పులకు ఉపయోగపడుతుంది.

పండ్లు కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

సీజన్ రాక ముందే కృత్రిమంగా మాగబెట్టిన రంగు వచ్చేటట్లు చేసిన పండ్లు కొనరాదు. రంగు చూసి మోసపోరాదు. ఇలాంటి పండు ఆరోగ్యానికి మంచిది కాదు. పండ్లు పరిపక్వత చెంది సహజంగా మాగిన పండ్లు తీసుకోవాలి. ఇవి ఆరోగ్యదాయకం.

తినేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు..

పండ్లను ముందుగా ఉప్పు కలిపిన నీటిలో 15–20 నిమిషాలు ఉంచి, తిరిగి వాటిని మంచి నీటిలో కడగాలి. తర్వాత తడి లేకుండా తుడిచి తినాలి. సాధ్యమైనంత వరకు పండ్ల తొక్కను తీసి తినడం మంచిది.

మాగబెట్టేందుకు ప్రత్యామ్నాయ రసాయనాలు

తప్పని పరిస్థితుల్లో కాయలు మాగబెట్టేందుకు వినియోగదారులకు హాని కలిగించని ఇథిలిన్ వాయువు 100 పీపీఎం మాత్రమే వినియోగించాలి. 100 పీపీఎం ఇథిలిన్ వాయువు 24 గంటలు తగిలేటట్లుగా ఉంచితే 5 రోజుల్లో సహజత్వానికి దగ్గరగా ఎలాంటి హాని లేకుండా మాగుతాయి. ఎత్రిల్, ఇథేపాన్ లిక్విడ్ ద్వారా కూడా మాగించవచ్చు. మామిడిని కోత అనంతరం 10 లీటర్ల నీటికి 13 ఎంఎల్ ఎత్రిల్ కలిపి అందులో ముంచి ఆరబెడితే సహజత్వానికి దగ్గరగా మాగుతాయి. వరిగడ్డి కింద మామిడిని మాగించడం మరింత సురక్షితం. ఇంటిలో కాయలు మాగబెట్టాలనుకుంటే కొన్ని మాగని కాయలను, మరికొన్ని మాగిన పండ్లను గాలి చొరబడని డబ్బాల్లో ఉంచాలి. లేదా పక్వానికి వచ్చిన కాయలను ఒక రూములో వరిగడ్డి లేదా బోదగడ్డిలో ఉంచితే సహజ సిద్ధంగా మాగుతాయి.



కార్బైడ్‌తో మాగించిన మామిడి

సహజంగా, కృత్రిమంగా మాగిన పండ్ల మధ్య తేడాలు

రంగు : సహజంగా మాగిన పండు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వంగా ఉంటుంది. కృత్రిమంగా మాగిన వాటిలో పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటాయి. పైకి మాగినట్లుగా కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటాయి.

వాసన : సహజంగా మాగిన పండు కొంత దూరంలో ఉన్నప్పటికీ కమ్మని మామిడి పండు వాసన వస్తుంది. కృత్రిమంగా మాగిన పండును ముక్కుకు దగ్గరగా ఉంచినప్పుడు మాత్రమే మామిడి పండు వాసన వస్తుంది.

రుచి: సహజంగా మాగిన పండులో తగినంత చక్కెర శాతం ఏర్పడుతుంది. దీంతో తియ్యగా రుచిగా ఉంటుంది. కృత్రిమంగా మాగిన పండులో తగినంత చక్కెర శాతం ఏర్పడక తక్కువ తీపిదనం, రుచి లేకుండా ఉంటాయి.

కాల్షియం కార్బైడ్ ఆరోగ్యానికి హానికరం



కార్బైడ్‌తో కృత్రిమంగా మాగించిన పండ్లను తినడం ద్వారా క్యాన్సర్, అల్సర్, కాలేయం, మూత్రపిండ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కార్బైడ్ ద్వారా వెలువడే ఎసిటిలీన్ వాయువు నాడి వ్యవస్థమీద ప్రభావం చూపుతుంది. అందుకే ప్రభుత్వం కార్బైడ్ వాడకాన్ని నిషేధించింది. ఇథలిన్ గ్యాస్ ద్వారా మాగబెట్టిన మామిడి ఆరోగ్యవంతంగా ఉంటుంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర కూడా లభిస్తుంది.

– పి.రామాంజనేయులు, ఏడీ, జిల్లా ఉద్యాన శాఖ

జర్నలిస్టుల స్థలాల్లో మట్టి తవ్వకాలు ఆపాలి



మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎం.సుధాకర్‌బాబు

కర్నూలు(సెంట్రల్): జగన్నాథగట్టులోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల్లో చేపడుతున్న మట్టి తవ్వకాలను ఆపాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకర్‌బాబు కోరారు. మంగళవారం ఆయన జర్నలిస్టుల స్థలాల్లో మట్టిని తవ్వుతున్న ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. మట్టి తవ్వకాలపై కలెక్టర్ స్పందించి నిలుపుదల చేయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణగుప్తా, బతుకన్న, బజారన్న, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

నేటి నుంచి తర్తూరు జాతర



జాతరలో ముస్తాబైన దుకాణాలు,

జూపాడుబంగ్లా: రాష్ట్రంలో ఎంతో పేరొందిన తర్తూరు శ్రీ లక్ష్మీరంగనాథుని జాతర బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే జాతరలో బొమ్మల దుకాణాలు, గాజుల అంగళ్లు, కుంకుమ, కాస్మోటిక్ అంగళ్లు ఏర్పాటు చేశారు. చిన్నారుల కోసం రంగులరాట్నాలు, ఊయలలు, రైలుబండీలు సర్వం సిద్ధమయ్యాయి. జాతరలో మటన్, చికెన్ చీకులకు ఎంతో ఆదరణ ఉంటుంది. వీటి రుచిని ఆస్వాదించేందుకు వివిధ ప్రాంతాల నుంచి జాతరకు తరలివస్తారు. నందికొట్కూరు ఆర్టీసి డిపో నుంచి జాతరకు ప్రతి అరగంటకో బస్సు నడుపనున్నారు. అలాగే జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మండ్లెం ప్రాంతాల నుంచి ఆటోలు అందుబాటులో ఉన్నాయి.

రోగులకు సత్వరం రిపోర్ట్‌లు ఇవ్వాలి



ప్రింటర్, జిరాక్స్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్):పెద్దాసుపత్రిని నమ్ముకుని ఎంతో దూరం నుంచి వచ్చిన రోగులకు సత్వరం వైద్యనిర్ధారణ పరీక్షల నివేదికలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రిలోని 24 ల్యాబ్‌లో బిగ్ ప్రింటర్, స్కానర్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ల్యాబ్‌లో నిర్ధారణ అయిన రిపోర్ట్‌లను వెంటనే వివిధ విభాగాలకు పంపించాలని, రోగులకు అందజేయాలని సూచించారు. ఆసుపత్రికి రోజూ 3వేల మంది దాకా రోగులు చికిత్స కోసం వస్తుంటారని, వారికి మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని, మనం వారికి అందించే వైద్యసేవలే ఈ ఆసుపత్రి పేరుప్రతిష్టలు ఆధారపడి ఉన్నాయని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, బయోకెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమోహన్, మైక్రోబయాలజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.జనార్దన్‌రావు, బయోకెమిస్ట్రీ పీజీ డాక్టర్ రేష్మ, చీఫ్ బయోకెమిస్ట్ ఎం.స్వాములు, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నీషియన్ రవీంద్ర, బయోకెమిస్ట్రి అనెలసిస్ట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, చిత్రంలో కలెక్టర్ కోటేశ్వరరావు



హాజరైన అధికారులు

- కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.కోటేశ్వరారవు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్, ఎస్పీ సిద్ధార్థ కౌశల్, సెబ్ స్పెషలాఫీసర్ కృష్ణకాంత్‌పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..పాఠశాలలు, కళాశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం కల్పించాలని విద్యా, వైద్య ఆరోగ్యశాఖలను ఆదేశించారు. మత్తు పానీయాలను వినియోగిస్తే కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయని, అనారోగ్యానికి గురవ్వాల్సి వస్తుందన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కు పాదం మోపాలన్నారు. వ్యవసాయ, అటవీ శాఖలు జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల పంటల అక్రమ సాగును నివారించాలన్నారు. అలాంటి రైతులను గుర్తించి ప్రభుత్వ పథకాల ద్వారా జీవనోపాధులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ సిద్ధార్థ కౌశల్ మాట్లాడుతూ..జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో అక్కడక్కడ గంజాయి సాగవుతోందన్నారు. కొందరు అక్రమ సంపాదన కోసం మత్తు పదార్థాలకు చెందిన పంటలను సాగు చేస్తున్నారన్నారు. అయితే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి జీవనోపాధులు కల్పిస్తున్నట్లు వివరించారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, డీఈఓ రంగారెడ్డి పాల్గొన్నారు.

పులిహోర.. ఇలాగే ఉంటుందా?

- వంట ఏజెన్సీ నిర్వాహకులపై జేడీ ఆగ్రహం



ఉయ్యాలవాడ ప్రాథమిక రెగ్యులర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ రాఘవరెడ్డి

ఉయ్యాలవాడ: 'జగనన్న గోరుముద్దలో విద్యార్థులకు వడ్డించే పులిహోర ఇలాగే ఉంటుందా.. అందులో పల్లీలు ఏమయ్యాయి. కనీసం తిరువాత కూడా పెట్టరా' అంటూ వంట ఏజెన్సీ నిర్వాహకులపై మత్స్యశాఖ జేడీ రాఘవరెడ్డి మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన మండలంలోని పెద్దయమ్మనూరు, ఇంజేడు ప్రాథమిక పాఠశాలలు, ఉయ్యాలవాడలోని ప్రాథమిక రెగ్యులర్ పాఠశాలలను సందర్శించారు. నాడు నేడు మొదటి విడత పనుల్లో 9 రకాల మౌలిక వసతుల్లో భాగంగా ఏర్పాటు చేసిన వస్తువులు ఏ మేరకు వినియోగంలో వున్నాయో పరిశీలించారు. ఆయా పాఠశాలలకు అగ్నిమాపక పరికరాలు మంజూరు చేసినా వాటిని తరగతి గదుల్లో అమర్చలేదు. అలాగే ఉయ్యాలవాడ ప్రాథమిక రెగ్యులర్ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంటు మూలన వుండడం గుర్తించారు. ఇదే పాఠశాలలో జగనన్న గోరుముద్దలో మోనూ అమలు చేయకపోవడం, పులిహోరను చిత్రాన్నంలా వండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు మాబూఫీరా, సీఆర్పీలు సిద్దమ్మ, లక్ష్మీదేవి, సిబ్బంది ఉన్నారు.